ఆగి ఉన్న లారీని ఢీకొని యువకుడి మృతి

జక్రాన్‌పల్లి, ఆగస్టు 13 : జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని సికింద్రాపూర్ వద్ద చోటు చేసుకున్నది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పడకల్ తండాకు చెందిన బాదావత్ సంతోష్(30) సోమవారం రాత్రి బైక్‌పై ఓ పనివిషయమై డిచ్‌పల్లి మండలం సుద్దపల్లికి బయల్దేరాడు. మార్గమధ్యంలో సికింద్రాపూర్ వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి దత్తాద్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బాల్కొండ, ఆగస్టు 13: ఈనెల 9న ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో గాయపడిన మండల కేంద్రానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి సిరికంటి మహేశ్ (35) మంగళవారం మృతిచెందినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. మహేశ్ బాల్కొండ శివారులోని ఇండియన్ పెట్రోల్‌బంక్‌లో పని చేస్తున్నాడు. 44వ నంబర్ జాతీయ రహదారిపై ఈనెల 9న ఆటో, బైక్ ఢీకొన్నాయి. బైక్ వెళ్తున్న మహేశ్‌ను రాంగ్ రూట్‌లో వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఆటో డ్రైవర్ షేక్ రహీమ్ అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ మహేశ్ బైక్‌ను ఢీకొట్టాడు. మహేశ్ తలకు తీవ్ర గాయలయ్యాయి. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్తుండగా మృతి చెందాడు. మృతుడి భార్య సిరికంటి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామనా ఎస్సై తెలిపారు.

ఏడో బెటాలియన్‌లో వన మహోత్సవం

మొక్కనాటి నీళ్లు పోస్తున్న కమాండెంట్

డిచ్‌పల్లి, ఆగస్టు 13 : డిచ్‌పల్లిలోని తెలంగాణ ప్రత్యేక పోలీస్ ఏడో బెటాలియన్ లో కమాండెంట్ రోహిణి ప్రియదర్శిని ఆధ్వర్యంలో మంగళవారం వన మహోత్సవం నిర్వహించారు.బెటాలియన్ ఆవరణలోని ప్రభుత్వ పాఠశాల పిల్లలతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ పి.శరత్‌కుమార్, కెపి.సత్యనారాయణ, ఆర్ఐలు వెంకటేశ్వర్లు, బి.శ్యామ్‌రావు, ఆర్.ప్రహ్లాద్, వసంత్‌రావు, ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.

40 మంది ఎస్సైలకు స్థాన చలనం

వినాయక్‌నగర్, ఆగస్టు 13: మల్టీ జోన్-1 పరిధిలోని పలు జిల్లాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్సైలు బదిలీ అయినట్లు నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి వెలువరించిన ఉత్తర్వుల ప్రకారం.. జోన్-2 బాసర పరిధిలోని నిజామాబాద్, జగిత్యాల్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లోని వివిధ పోలీసుస్టేషన్లలో పనిచేస్తున్న 40 మంది సివిల్ ఎస్సైలకు స్థానచలనం కలిగినట్లు పేర్కొన్నారు.

మాక్లూర్ మండలంలోని కల్లెడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం సరస్వతీ, వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. విగ్రహ దాతలు పుంజు మనీశ్‌గౌడ్, బోడిగం నగేశ్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు. - మాక్లూర్, ఆగస్టు 13

మైక్ సెట్, సౌండ్‌బాక్స్ అందజేత

బాల్కొండ, ఆగస్టు 13 : బస్సాపూర్ ప్రాథమిక పాఠశాలకు ముప్కాల్‌కు చెందిన లక్ష్యం ట్యూటోరియల్స్ వ్యవస్థాపకుడు బొడ్డు దేవేందర్‌గౌడ్ రూ.20వేల విలువ గల మైక్‌సెట్, సౌండ్‌బాక్స్‌లను అందించాడు. కార్యక్రమంలో హెచ్ఎం రాజారాం, వీడీసీ సభ్యులు సంతోష్, ఉపాధ్యాయులు బోయడ నర్సయ్య, సాయన్న, రమాదేవి పాల్గొన్నారు.

జగిత్యాల జిల్లాకు వెళ్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పెర్కిట్ బైపాస్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నాయకులు మంగళవారం ఘన స్వాగతం పలికారు. శాలువాలతో సన్మానించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. - ఆర్మూర్‌టౌన్, ఆగస్టు13

గిరిరాజ్‌లో 'సమరయోధుల' ఫొటోఎగ్జిబిషన్

కంఠేశ్వర్, ఆగస్టు 13: జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సమాచార,ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యునికేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధుల ఫొటో ఎగ్జిబిషన్‌ను మేయర్ నీతూకిరణ్, అదనపు కలెక్టర్ సంకేత్‌కుమార్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో రాంజీగోండు, కుమ్రం భీం, చాకలి ఐలమ్మ, స్వామి రామానంద తీర్థ, అల్లూరి సీతారామరాజు, టంగుటూరి ప్రకాశం పంతులు, సురవరం ప్రతాప్‌రెడ్డి, కొండా లక్ష్మణ్ బాపూజీ తదితరుల చిత్రాలను ప్రదర్శించారు. ఫొటోఎగ్జిబిషన్ పై నిర్వహించిన వ్యాసరచ, ఉపన్యాస పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ముఖ్యఅతిథులు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామ్మోహన్‌రెడ్డి, జిల్లా మహిళా సంక్షేమ అధికారిణి ఎస్ కె రసూల్ బీ, జిల్లా యువజన అధికారిణి శైలీ బెల్లాల్, టీయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రవీంద్రారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. ఫొటో ఎగ్జిబిషన్ నేడు(బుధవారం) కూడా కొనసాగనున్నది.

ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న నగర మేయర్ నీతూకిరణ్

రాత్రికి రాత్రే ఇసుక డంపులు మాయం..

పోతంగల్, ఆగస్టు 13: మండలంలో ఇసుక మాఫియా రెచ్చిపోతున్నది. మండల కేంద్రంలో మంజీరా నది రెండో బ్రిడ్జి సమీపంలో సోమవారం పోలీసులు, రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఇసుక డంపులు రాత్రికి రాత్రే మాయమయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు మంజీర నది రెండో వంతెన సమీపంలోఅధికారులు సోమవారం మధ్యాహ్నం 18 ట్రాక్టర్ల ఇసుక డంపులను సీజ్ చేశారు. వాటిని మంగళవారం వేలం వేయాలని అధికారులు ప్రకటించారు. కానీ మంగళవారం ఉదయం చూసే సరికి అక్కడ ఇసుక డంపులు మాయం కావడంతో గ్రామస్తులతోపాటు అధికారులు అవాక్కయ్యారు. దీనిపై తహసీల్దార్ మల్లయ్యను వివరణ కోరగా.. కాపలాగా ఉన్న రెవెన్యూ సిబ్బంది రాత్రి 8 గంటలకు భోజనానికి ఇంటికి వెళ్లి 10.30 గంటలకు వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు ఇసుక డంపులను మాయం చేశారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇది ఇలా ఉండగా, మండలంలోని కొడిచర్ల గ్రామంలో వేర్వేరు చోట్ల ఇసుక డంపులను మంగళవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారని, నేడు తహసీల్ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

మంగళవారం కనిపించని ఇసుక డంపులు

ఉపాధి హామీలో అక్రమాలు

రుద్రూర్, ఆగస్టు 13: ఉపాధి హామీ పథకంలో అక్రమాలు బయటపడ్డాయి. సిబ్బంది లక్షల రూపాయల అవినీతికి పాల్పడినట్లు సామాజిక తనిఖీ ప్రజావేదికలో డీఆర్పీలు వెల్లడించారు. అవినీతికి పాల్పడిన వారిపై ప్రత్యేక విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని డీఆర్డీవో సాయాగౌడ్ స్పష్టం చేశారు. రుద్రూర్ మండల కేంద్రంలోని సమీకృత భవనం వద్ద మంగళవారం డీఆర్డీవో సాయాగౌడ్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఉపాధి హామీలో సిబ్బంది, అధికారులు అక్రమాలకు పాల్పడ్డారంటూ కూలీలు ఆగ్రహం వ్యక్తంచేశారు.గ్రామాల వారీగా సామాజిక తనిఖీ చేపట్టిన డీఆర్పీలు తమ నివేదికలను చదివి వినిపించారు. అక్బర్ నగర్, రాణంపల్లి గ్రామాల్లో సీనియర్ మేట్లు అవినీతికి పాల్పడినట్లు తెలిపారు. ఒకే కుటుంబంలో ముగ్గురికి జాబ్ కార్డు ఇప్పించారన్నారు. కుటుంబ సభ్యులకు తెలియకుండా జాబ్ కార్డులు తయారుచేశారని, గ్రామంలో సుమారు రూ. 32లక్షల అవినీతికి పాల్పడినట్లు తెలిపారు. ఉపాధిలో సీనియర్ మేట్లు, అధికారులు చేసిన అవినీతి అక్రమాలపై ప్రత్యేక విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని డీఆర్డీవో సాయాగౌడ్ హెచ్చరించారు.

సీనియర్ మేట్‌ను ప్రశ్నిస్తున్న డీఆర్డీవో

వరుణ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ప్రారంభం

ఖలీల్‌వాడి , ఆగస్టు 13: జిల్లా కేంద్రంలోని ట్రూవాల్యూ షోరూంలో వరుణ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వరుణ్ మోటర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్‌సీ రాజు మాట్లాడుతూ.. ఎంతో మందికి నైపుణ్యం కలిగిన శిక్షణ ఇవ్వడంతో పాటు ఉద్యోగావకాశాలను కల్పిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లావాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ రమణాగుప్తా, సర్వీస్ మేనేజర్ శ్రీనివాస్, వీటీఐ ప్రిన్సిపాల్ రాజమౌళి, అసిస్టెంట్ మేనేజర్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వరుణ్ మోటర్స్ ప్రతినిధులు

జిల్లా కేంద్రంలోని అర్చిడ్ పాఠశాలలో మంగళవారం షీటీం సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీటీం ప్రతినిధులు, కానిస్టేబుళ్లు హరిత, శ్రీకాంత్, నాగరాజు, పాఠశాల కరస్పాండెంట్ క్రాంతి , ప్రిన్సిపాల్ సరిత, ప్రీతి, సంగీత తదితరులు పాల్గొన్నారు. - ఖలీల్‌వాడి, ఆగస్టు 13

బదిలీపై వెళ్తున్న మున్సిపల్ అధికారులను మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రాజు, చైర్‌పర్సన్ లావణ్య సన్మానించారు. వైస్ చైర్మన్ మున్నా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. - ఆర్మూర్‌టౌన్, ఆగస్టు13

పోస్టల్ పథకాలపై అవగాహన

డిచ్‌పల్లి/ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 13: టీయూలోని టీచింగ్, నాన్‌టీచింగ్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి పరిధిలోని తపాలా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్టల్ సుస్మిత బెనర్జీ హాజరై మాట్లాడారు. నిజామాబాద్ సౌత్ సబ్ డివిజన్ తపాలా కార్యాలయం వారు అందిస్తున్న వివిధ రకాల స్కీమ్‌లను వివరించారు. కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది, తెలంగాణ వర్సిటీ సబ్ పోస్ట్ మాస్టర్ చరణ్, బి.స్నేహిత్, ఎన్.సుశాంత్, మంథెన రవి పాల్గొన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని ఆర్మూర్ తపాల శాఖ అధ్వర్యంలో పోస్టల్ స్కీములపై తపాల శాఖ అధికారి దశరథ్ ప్రజలకు అవగాహన కల్పించారు.

దిష్టిబొమ్మ దహనం

ఏర్గట్ల, అగస్టు 13: బంగ్లాదేశ్ హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా మండల కేంద్రంలో బంగ్లాదేశ్ ముస్లింల దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు మంగళవారం దహనం చేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి కొండ ఘన శ్యాం, మహిపాల్ రెడ్డి, అయోధ్య నర్సయ్య, ప్రశాంత్, రమేశ్‌రెడ్డి, జీవన్ పాల్గొన్నారు.

నందిపేట్‌లో హెల్త్ క్యాంప్

నందిపేట్, ఆగస్టు 13: మండలంలోని ప్రభుత్వ దవాఖాన ఆధ్వర్యంలో అయిలాపూర్ గ్రామపంచాయతీ సెక్టార్‌లోని కంఠం గ్రామంలో వైద్యులు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. 193 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధులున్న వారికి మందులు, ఇంజక్షన్లు అందించామని వైద్యుడు తెలిపారు. 21 మంది నుంచి రక్త నమూనాలు సేకరించామన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దేవానంద్, నర్స్, పద్మావతి, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్, ఏఎన్ఎం రేణుకా, గ్రామపంచాయతీ సెక్రటరీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దత్తత తీసుకున్న బాలుడికి చిత్రహింసలు

శక్కర్‌నగర్, ఆగష్టు 13: చట్టవిరుద్ధంగా దత్తత తీసుకున్న ఓ బాలుడితో వెట్టి చాకిరీ చేయించిన ఘటన రాకాసీపేట్‌లో వెలుగుచూసింది. స్థానికుల కథనం మేరకు.. రాకాసీపేట్‌లోని ఓ ఇంట్లో నుంచి బాలుడి కేకలు సోమవారం రాత్రి స్థానికులకు వినిపించాయి. దీంతో కాలనీకి చెందిన ఆమ్‌ఆద్మీ పార్టీ బోధన్ కన్వీనర్ జునేద్ అహ్మద్ ఖలీల్‌తోపాటు మరికొందరు ఆ ఇంటి వద్దకు వెళ్లగా బాలుడు బయటికి వచ్చి మాట్లాడాడు. తనతో బలవంతంగా పనులు చేయిస్తున్నారని తెలిపారు. దీంతో బాలుడిని అదే రాత్రి బోధన్ పట్టణ పోలీసులకు అప్పగించారు. బాలుడిని శిశు సంక్షేమ శాఖ అధికారులకు మంగళవారం సాయంత్రం అప్పగించినట్లు సీఐ వీరయ్య తెలిపారు.

20 వరకు అడ్మిషన్లు తీసుకోవాలి

ఖలీల్‌వాడి, ఆగస్టు 13 : జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లను ఈనెల 20 వరకు తీసుకోవచ్చని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా ఇంటర్ విద్యాధికారి కార్యాలయంలో ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లతో 2024-25 విద్యా సంవత్సరానికి గాను అకడమిక్, అడ్మిషన్లపై సమీక్ష నిర్వహించారు.

హైదరాబాద్‌కు తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు

డిచ్‌పల్లి/ జక్రాన్‌పల్లి/ ఖలీల్‌వాడి, ఆగస్టు 13: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన అనంతరం ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు తిరిగి వస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగకు స్వాగతం పలకడానికి జిల్లాలోని ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు, మాదిగ సంఘ సభ్యులు, ఉద్యోగులు, అభిమానులు మంగళవారం అధిక సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. అక్కడ నిర్వహించిన భారీ విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు.ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏండ్లు అలుపెరగని పోరాటం చేసిన మాదిగ యోధుడు మందకృష్ణ మాదిగకే దక్కుతుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు సరికాల పోశెట్టి మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్ మాదిగ, నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ

మోర్తాడ్ మండలం సుంకెట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం వంద మంది విద్యార్థులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. కేసీ డయాగ్నోస్టిక్ వ్యవస్థాపకుడు రావికంటి చాందిని, కృష్ణచైతన్య రూ.50వేలతో వీటిని కొనుగోలు చేసి విద్యార్థులకు అందజేశారు. ఆరు నుంచి పదో తరగతి వరకు ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థులకు బ్లేజర్లను అందజేశారు. -మోర్తాడ్, ఆగస్టు13

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

నందిపేట్, ఆగస్టు 13 : ఉమ్మడి నందిపేట్, డొంకేశ్వర్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో 414 సీఎం సహాయనిధి చెక్కులను ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి మంగళవారం పంపిణీ చేసి మాట్లాడారు. సీఎం సహాయనిధి లబ్ధి కోసం గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకోగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మంజూరు చేయించానని ఎమ్మెల్యే అన్నారు. హిందువులపై బంగ్లాదేశ్‌లో జరుగుతున్న దాడులకు నిరసనగా బుధవారం రాత్రి 7 గంటలకు నియోజకవర్గ వ్యాప్తంగా కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించాలన్నారు.

ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి సన్మానం

బోధన్ రూరల్, ఆగస్టు 13: బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని మంగళవారం బోధన ఏఎంసీ వైస్ చైర్మన్ చీలశంకర్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంగజి శంకర్, నరేందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, గడ్డం శీను, ప్రకాశ్, ఆశోక్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా నలుగురికి గాయాలు

నస్రుల్లాబాద్, ఆగస్టు 13 : బీర్కూర్ శివారులోని తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానం వద్ద మంగళవారం ఆటో బోల్తా పడి నలుగురికి గాయాలయ్యాయి. నిజామాబాద్ జిల్లా నవీపేట్ గ్రామానికి చెందిన వంశీకృష్ణ తన కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా 10 మంది కుటుంబ సభ్యులతో కలిసి తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళ్తుండగా ఘాట్ రోడ్డు ఎక్కుతుండగా కల్యాణ కట్ట వద్ద ఆటో వెనక్కి వచ్చి బోల్తా పడింది. ప్రమాదంలో నలుగురికి గాయాలు కాగా వారిని బాన్సువాడ ఏరియా దవాఖానకు తరలించారు.

పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా రాజారెడ్డి

ధర్పల్లి, ఆగస్టు 13: మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పీఆర్టీయూ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వెంకట రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సతీష్‌కుమార్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, కార్యదర్శిగా ప్రసన్నకుమార్, మహిళ ఉపాధ్యక్షురాలిగా స్నేహలతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలం పరిశీలన

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు13: మండలంలోని చేపూర్ గ్రామంలో వివాదాస్పద శ్మశానవాటిక స్థలాన్ని ఆర్డీవో రాజాగౌడ్‌తో కలిసి కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుడు మంగళవారం పరిశీలించారు. వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విచారణ చేపడుతామని తెలిపారు. ఆయన వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

ఆయిల్ పామ్ పంట ..

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు13: అంకాపూర్‌లో సాగుచేస్తున్న ఆయిల్ పామ్ పంటను ట్రైనీ కలెక్టర్ అంకిత్ కుమార్, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి బండారి శ్రీనివాస్, ఆర్మూర్ నియోజకవర్గ ఉద్యానవన శాఖ అధికారి సంధ్యారాణి మంగళవారం సందర్శించారు. పంటను సాగు చేస్తున్న రైతులతో మాట్లాడారు. బిందు సేద్యం యజమాన్య పద్ధతులను అడిగి తెలుసుకున్నారు.

రౌడీ షీటర్ అరెస్ట్- రిమాండ్

శక్కర్‌నగర్, ఆగస్టు13: బోధన్ పట్టణంలోని అబ్బు అనే రౌడీషీటర్‌ను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ సంద్ర వీరయ్య తెలిపారు. ఇటీవలి గోశాల రోడ్డులో పలువురిని బెదిరించి వారిపై దాడి చేయడంతోపాటు, పోలీస్ స్టేషన్‌లో హంగామా సృష్టించిన రౌడీ షీటర్‌పై గతంలోనే కేసులు నమోదు చేశామని అన్నారు. తాజాగా గోశాల ప్రాంతంలోని వర్తకుల వద్ద నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు అందిన ఫిర్యాదుల మేరకు అబ్బును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

ఏసీబీ కేసులో ట్రాన్స్‌కో అధికారికి ఏడాది జైలు

వినాయక్‌నగర్, ఆగస్టు 13: ఏసీబీ కేసులో ట్రాన్స్‌కో అధికారికి ఏడాది జైలు శిక్షతోపాటు రూ.10వేలు జరిమానా విధించినట్లు ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు మాక్లూర్ మండలం మదన్‌పల్లి పరిధిలో ఉన్న వ్యవసాయ క్షేత్రంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం యజమాని శ్రీనివాస్‌రెడ్డి 2008 జూలై 24న ట్రాన్స్‌కో ఏఏఈ మచ్చ సదాశివ్‌ను ఆశ్రయించాడు. సదరు అధికారి రూ. 5 వేలు లంచం డిమాండ్ చేయగా రూ. మూడు వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో శ్రీనివాస్‌రెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. లంచం తీసుకుంటూ ఏఏఈ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడగా కేసు నమోదు చేసి, జైలుకు తరలించారు. ఈ కేసులో ఏసీబీ తరపున లక్ష్మి మనోజ్ఞ, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యుటర్ తన వాదనలు వినిపించగా.. ఏసీబీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలల పాటు సాధారణ జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పు వెలువరించారు.

కార్గో ఏజెంట్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఖలీల్‌వాడి, ఆగస్టు 13 : ఆర్టీసీ కార్గోలో ఏజెంట్ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు మంగళవారం తెలిపారు. సెక్యూరిటీ డిపాజిట్ రూ. 5వేలు చెల్లించాలని సూచించారు. రాఖీ పండుగ సందర్భంగా రాఖీలు, స్వీట్లు అతి తక్కువ ఖర్చుతో వేగంగా భద్రంగా రవాణా చేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు ఆర్మూర్-7396889496, బోధన్ 9014296638, నిజామాబాద్ డిపో-1 9154298727, డిపో-2 7396889496, బాన్సువాడ 9154298729, కామారెడ్డి 9154298729, ఆర్ఎం 8639963647 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పోచంపాడ్‌లో విద్యుదుత్పత్తి ప్రారంభం

మోర్తాడ్, ఆగస్టు13: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ జలవిద్యుత్తు ఉత్పత్తి కేంద్రంలో ఒక టర్బయిన్ ద్వారా విద్యుత్ ఉత్పత్తిని సోమవారం ప్రారంభించినట్లు జెన్‌కో డీఈ శ్రీనివాస్ తెలిపారు. కాకతీయ కాలువకు మూడువేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండడంతో రెండో టర్బయిన్ ద్వారా 4.8మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని తెలిపారు. ఒకటి, మూడు, నాలుగో టర్బయిన్లను కూడా సిద్ధం చేశామని చెప్పారు. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతం నుంచి మంగళవారం 4283 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది.

సంక్షిప్తంగా..

- **సన్మానం:** చందూర్, ఆగస్టు 13: చందూర్‌కు బదిలీపై వచ్చిన పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ నగేశ్, బిల్ కలెక్టర్ మహేశ్‌ను సొసైటీ చైర్మన్ ప్యారం అశోక్‌తోపాటు పలువురు మంగళవారం సన్మానించారు.
- **ఎన్ఎస్‌యూయూ నూతన కమిటీ ఎన్నిక:** టీయూ ఎన్ఎస్‌యూ (నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు బానోత్ సాగర్‌నాయక్ తెలిపారు. ఉపాధ్యక్షులుగా చౌదర్‌పల్లి మహేశ్‌కుమార్, హరీశ్, ప్రధాన కార్యదర్శిగా జనార్దన్, నవీన్, కార్యదర్శులుగా అలియాస్, బాలాజీ, సభ్యులుగా అపర్ణ, రమ్య, మధు, గోవింద్, రాజేందర్, రాజ్‌కుమార్, మహేందర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.
- **క్రాప్‌లోన్ చెక్కుల పంపిణీ:** సారంగాపూర్, ఆగస్టు 13 : మండలంలోని మాధవ్‌నగర్ పీఏసీఎస్‌లో రుణమాఫీ పొందిన రైతులకు విండో చైర్మన్ దాసరి నాగేశ్వర్‌రావు, సీఈవో వంశీకృష్ణ పంట రుణాల చెక్కులను మంగళవారం అందజేశారు. మొత్తం 38 మంది సభ్యులకు రూ.27.90 లక్షల చెక్కులను అందజేయగా.. రైతులు ఆనందం వ్యక్తం చేశారు.
- **పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష :** ధర్పల్లి, ఆగస్టు 13: మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో బాలకృష్ణ సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని వాడవాడలా తిరుగుతూ పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నీటి నిల్వలు లేకుండా, చెత్తా చెదారం లేకుండా చూసుకోవాలన్నారు. మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.
- **బాధ్యతల స్వీకరణ-** ఆర్మూర్‌టౌన్, ఆగస్టు13: పట్టణంలోని డిగ్రీ కళాశాలలో నూతన ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా వేణుగోపాల్ ప్రసాద్(కళాశాల అస